

రైతులకు చెక్కులు పంపిణీ చేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

భూములిచ్చిన రైతులకు నష్టపరిహారం అందజేత

» చెక్కులు పంపిణీ చేసిన కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక పార్కు ఏర్పాటులో భాగంగా భూములను ఇచ్చిన రైతులను నష్టపరిహార చెక్కులను అందజేసినట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల మండలం హకీంపేటకు చెందిన పలువురు రైతులకు నష్ట పరిహారం చెక్కులను తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాదతో కలిసి కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూములు కోల్పోయిన రైతులు ప్రభుత్వం అందజేసిన నష్ట పరిహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హకీంపేటలో 93.16 ఎకరాల భూమిని పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు 62 మంది రైతులు తమ భూములను ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ వీవీటీ శారద, అసిస్టెంట్ జాయిన్ మేనేజర్ అజీమా సుల్తానా, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్ రెడ్డి, దుద్యాల తహసీల్దార్ కిషన్, హకీంపేట రైతులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

» అధికారులతో మేడ్చల్ కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ ప్రతినిధి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఇంటర్ పరీక్షలకు సంబంధించి వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 5 నుంచి 25వ తేదీ వరకు జరిగే ఇంటర్ పరీక్షలకు జిల్లాలో 150 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొదటి సంవత్సరం 64,107 మంది, రెండో సంవత్సరం 62,316 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. ఇంటర్ పరీక్షల కోసం నాలుగు ఫ్లైయింగ్ స్క్వాడ్స్, ఐదు సిట్టింగ్ స్క్వాడ్స్ టీములను ఏర్పాటు చేసినట్లు వివరించారు. పరీక్షా కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, అధికారులందరు సమన్వయంతో ఇంటర్ పరీక్షలను సజావుగా నిర్వహించేలా చూడాలని సూచించారు.



ప్రభుత్వ భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు ఇలా

తవ్వుకునోళ్లకు.. తవ్వుకున్నంత!

పగలంతా చడీచప్పుడు ఉండదు.. చీకటి పడిందంటే చాలు జేసీబీలు, టిప్పర్లు రోడ్లపై రయ్ రయ్ అంటూ తిరుగుతుంటాయి. అనుమతులు తీసుకోరు.. నిబంధనలు పాటించరు. రాత్రికి రాత్రే కట్టలు, గుట్టలను మాయం చేస్తున్నారు. మట్టి అక్రమ తవ్వకాలు, తరలింపునకు పరిగి అడ్డాగా మారింది. అసైన్‌మెంట్, ప్రభుత్వ భూముల్లో తవ్వుకున్నోళ్లకు తవ్వుకున్నంత. రాజకీయ పలుకుబడి, అధికారుల అండతో మట్టి వ్యాపారం మూడు టిప్పర్లు, ఆరు లారీలు అన్న చందంగా సాగుతోంది. ఈ దందా గురించి ఎవరైనా మాట్లాడినా, నిలదీసినా దాడులు తెగబడుతున్నారు. అయినా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు.

అనుమతులుండవు.. నిబంధనలు పాటించరు

చీకటిపడితే జేసీబీ, టిప్పర్ల మోత

మట్టి తవ్వకాలకు అడ్డాగా పరిగి కేంద్రం

అధికారులకు కాసులు కురిపిస్తున్న దందా

రాజకీయ పలుకుబడితోనే వ్యాపారం

ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు

రాత్రికి రాత్రే గుట్టలు, కట్టలు మాయం



ఇటీవల అక్రమంగా మట్టిని తరలిస్తూ ప్రమాదానికి గురైన టిప్పర్

పరిగి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మట్టి అక్రమ తవ్వకాలు, తరలింపు వ్యాపారం పరిగి పరిధిలో జోరుగా సాగుతోంది. పరిగి మండలంలోని నజీరాబాద్, బసిరెడ్డిపల్లి, రంగాపూర్, నజిరాబాద్‌తండా, ఇబ్రహీంపూర్, రంగంపల్లి, తుంకులగడ్డ, సుల్తాన్‌పూర్, జాఫర్‌పల్లి, సయ్యద్‌మల్కాపూర్, ఖుదావంద్‌పూర్, రాఘవాపూర్‌లలో ఇబ్బడిముబ్బడి మట్టిని తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. ఏదో కొద్ది ప్రాంతానికి అనుమతులు తీసుకొని నచ్చిన చోటు వరకు మట్టిని తవ్వుతూ పెద్దపెద్ద లోయలుగా మార్చుతున్నారు. దొంగదారిన అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్ గత శుక్రవారం తెల్లవారుజామున పరిగి శివారులో మరో వాహనానికి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు వాహనాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఒకలారీ నాన్‌లోకల్‌ది

మిగతా 8వ పేజీలో...

అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే..

పరిగి ప్రాంతంలో కొనసాగుతున్న ఈ మట్టి దందా ప్రధాన రాజకీయ పార్టీల నాయకుల కనుసన్నల్లోనే జరుగుతున్నట్లు తెలుస్తోంది. వ్యాపారంలో ఒకరిపై ఒకరు గిట్టని వారు అధికారులకు పరస్పర ఫిర్యాదులు చేసుకుంటున్నారు. ఆ తర్వాత అక్కడే సెటిల్‌మెంట్లు చేసుకుంటున్నారు. మట్టి దందా పంచాయితీలను ప్రభుత్వ కార్యాయాల్లోనే పరిష్కరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అధికార పార్టీ నేతలే ఈ అక్రమ వ్యాపారాన్ని నడిపిస్తున్నట్లు సమాచారం.

రూ.4.79 కోట్లు

విడుదల

అర్హులైన రైతుల ఖాతాలకు పీఎం కిసాన్ సాయం బదిలీ

వికారాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్ర జ్యోతి ప్రతినిధి) : అన్నదాతలకు పీఎం కిసాన్ సమ్మాన్ యోజన పేరిట అందిస్తున్న పెట్టుబడి సాయాన్ని సోమవారం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. జిల్లాలో 73,981 మంది రైతులకు రూ.14.79 కోట్ల ఆర్థిక ప్రయోజనం కలిగింది. అయిదెకరాల లోపు రైతులకు ఏటా రూ.6 వేల వంతున పెట్టుబడి సాయంగా అందజేస్తున్న కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది తొలి విడత సాయంగా ఎకరాకు రూ.2 వేల వంతున రైతుల బ్యాంకు ఖాతాలకు బదిలీ చేసింది. ఈ పథకం ప్రారంభించిన సమయంలో అందుకున్న తొలి విడత సాయంతో పోలిస్తే జిల్లాలో లబ్ధిదారుల సంఖ్య గణనీయంగా తగ్గింది. అయిదెకరాల లోపు రైతులకు వర్తింపజేయడం, ఈ-కేవైసీ విధిగా చేయించాలన్న నిబంధనతో అర్హుల సంఖ్య ఏటేటా తగ్గుతోంది.



మాట్లాడుతున్న పుల్లయ్య

సాంకేతిక పరిజ్ఞానానిది కీలక భూమిక

రాష్ట్ర సాంకేతిక విద్యా మండలి కార్యదర్శి పుల్లయ్య

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 24 (ఆంధ్ర జ్యోతి): నేటి యుగంలో వివిధ రంగాల్లో సాంకేతిక పరిజ్ఞానం కీలక భూమికను పోషిస్తున్నదని రాష్ట్ర సాంకేతిక విద్యా మండలి కార్యదర్శి పుల్లయ్య అన్నారు. సోమవారం ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని కొండాపూర్‌లో గల సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన రెండు రోజుల టెక్ట్రిక్స్ 2కె-25 సాంకేతికోత్సవాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక విద్యలో మన దేశ సిలబస్‌ను ఇతర దేశాలు సైతం అనుసరిస్తున్నాయని గుర్తు చేశారు. విద్యార్థులు పరిశోధనపై దృష్టి సారించి తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ టెక్నికల్ ఫెస్టివల్‌లో మొత్తం 32 ఈవెంట్లు నిర్వహించినట్లు కళాశాల ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ మల్లాడి రమాకాంత్‌రెడ్డి, ఆయా విభాగాల ప్రిన్సిపాళ్లు డాక్టర్ జానకి రాములు, డాక్టర్ శ్రావణ్ కుమార్, ప్రొఫెసర్ శివ కేశవరెడ్డి, కార్యక్రమ కన్వీనర్ మోహన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉల్లిసాగు.. భలే బాగు!

» తాండూరు మండలంలో అధిక విస్తీర్ణంలో సాగు

» కోతకు వచ్చిన పంట.. ఆశాజనకంగా ధరలు

» మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.3 వేలు

» మండలంలో సుమారు 2వేల ఎకరాల్లో సాగు

తాండూరు రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): తాండూరు మండల పరిధిలో యాసంగిలో పెద్ద మొత్తంలో ఉల్లిపంటను సాగుచేశారు. మండలంలోని మిట్టబాస్పల్లి, గుంతబాస్పల్లి, కోటబాస్పల్లి, ఐనెల్లి, ఉద్దండాపూర్, సంకిరెడ్డిపల్లి, సంకిరెడ్డిపల్లితండా, గుండ్లమడుగుతండా, మైసమ్మ గడ్డతండా, సిరిగిరిపేట్, వీరారెడ్డిపల్లి, రాంపూర్, కొత్లాపూర్, సంగెంకలాన్, మల్కాపూర్, జినుగుర్తి తండా తదితర గ్రామాల్లో సుమారు 2వేల ఎకరాల్లో ఉల్లిపంటను సాగు చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఉల్లి ధర ఆశాజనకంగా ఉంది. సాగుకు అనువైన వాతావరణం ఉన్నందున రైతులు ఈ సాగు చేసేందుకు ముందుకొస్తున్నారు. బళ్లారి రెడ్, రాంపూర్ రెడ్, వైట్ ఆనియన్, నాసిక్‌రెడ్, అగ్రిఫౌండ్ డార్క్ రెడ్, ఎన్.53, అగ్రిఫౌండ్ లైట్ రెడ్ తదితర అధిక దిగుబడినిచ్చే రకాలు అందుబాటులో ఉన్నాయి.

మిట్టబాస్పల్లిలో 500 ఎకరాల్లో సాగు

ప్రస్తుతం తాండూరు మండల పరిధిలోని ఒక్క మిట్టబాస్పల్లి గ్రామంలోనే 500 ఎకరాల్లో ఉల్లిసాగు చేస్తున్నారు. అయితే ప్రస్తుతం కోతకు వచ్చిన పంట హైదరాబాద్ నగరంలోని మలక్‌పేట్ ఉల్లి



మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.3వేల వరకు ధర పలుకుతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. ధరలు ఆశాజనకంగా ఉండటంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆశాజనకంగా పంట



ప్రస్తుతం పూర్తిగా పంట కోతకు వచ్చింది. కొందరు ఇప్పటికే కోతలు పూర్తి చేసి మార్కెట్‌లో విక్రయించుకుంటున్నారు. ప్రస్తుతం రోజుకు 2 నుంచి 3 లారీల ఉల్లిని మార్కెట్‌కు తరలిస్తున్నారు. క్వింటాల్ ధర రూ.2,500 నుంచి రూ.3వేల వరకు పలుకుతోంది. పంట బాగుండడం, ధరలు కూడా కలిసిరావడం సంతోషంగా ఉంది.

-షేక్ ఇస్మాయిల్, ఉల్లి రైతు, మిట్టబాస్పల్లి

రాష్ట్రస్థాయి పోటీల్లో వికారాబాద్ అథ్లెటిక్స్ సత్తా

వికారాబాద్, ఫిబ్రవరి 24(ఆంధ్ర జ్యోతి): సికింద్రాబాద్ జింఖానా మైదానంలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి మాస్టర్స్ గేమ్స్ అసోసియేషన్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో వికారాబాద్ జిల్లా అథ్లెట్లు విజయ ఢంకా మోగించారు. జిల్లా నుంచి 33 మంది అథ్లెట్స్ పాల్గొనగా మొత్తం 58 పతకాలు సాధించారు. 21 గోల్డ్ మెడల్స్ 24 సిల్వర్ మెడల్స్ 13 బ్రాంజ్ మెడల్స్ కైవసం చేసుకున్నారు. ఈ పోటీల్లో జిల్లా సీనియర్ అథ్లెట్ మొరంగపల్లి అశోక్ వాకింగ్‌లో గోల్డ్ మెడల్, హ్యామర్‌త్రోలో స్విలర్ మెడల్, డిస్కస్ త్రోలో సిల్వర్ మెడల్‌తో పాటు ప్రైడ్ ఆఫ్ తెలంగాణ స్పోర్ట్స్ అవార్డు అందుకున్నారు.



గోల్డ్ మెడల్ అందుకుంటున్న అశోక్



బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఆలయ చైర్మన్ తటాకం నారాయణ శర్మ

కీసరగుట్ట బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

అట్టహాసంగా ప్రారంభమైన మహాశివరాత్రి జాతర

ఆరు రోజుల పాటు స్వామివారికి ప్రత్యేక పూజలు.. వైధిక కార్యక్రమాలు

జాతరలో క్రీడా పోటీలను ప్రారంభించిన స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డి

నేడు స్వామివారి కల్యాణమహోత్సవం.. పెద్ద సంఖ్యలో హాజరుకానున్న భక్తులు

కీసర, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కీసరగుట్ట శ్రీభవానీ శివదుర్గ సమేత శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సోమవారం అంకురార్పణ జరిగింది. మొదటి రోజు విఘ్నేశ్వరుని పూజతో ఉత్సవాలను ప్రారంభించారు. ఆలయ చైర్మన్ తటాకం నారాయణశర్మ ఆధ్వర్యంలో, వేద పండితులు గణపతి శర్మ పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అర్చకులు ఆయనకు స్వామివారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం ఇచ్చారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ భక్తులకు ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారన్నారు. ఉత్సవాల సందర్భంగా పలు కుల సంఘాల ఆధ్వర్యంలో అన్నదానాలను ప్రారంభించారు. మొదటి రోజు ఆర్యవైశ్య, రెడ్డి అన్నదానం సత్రాలలో అన్నదానాలు ప్రారంభమయ్యాయి. ఆరు రోజుల పాటు క్షేత్రంపై అన్నదానాలు నిర్వహించనున్నారు. అలాగే ఆలయ చైర్మన్ తటాకం నారాయణ శర్మ, ఈవో సుధాకర్‌రెడ్డి కలెక్టరేట్‌లో కలెక్టర్ గౌతమ్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు. అదే విధంగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు ఆహ్వానం అందజేశారు.



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న శివసేన రెడ్డి

నేడు స్వామి వారి కల్యాణం

రెండో రోజు మంగళవారం రుద్రస్వాహాకార హోమం, జ్వాలార్చన, రుద్రస్వాహాకార హోమం, హారతి, మంత్రపుష్పం, పరాకస్తం, తీర్థ ప్రసాద వినియోగం, శ్రీ స్వామివారి

మిగతా 7వ పేజీలో...



బల్దియా కార్యాలయం

మళ్లీ మొదటికే..

గతి తప్పిన వికారాబాద్ బల్దియా

చేతివాటం ప్రదర్శిస్తున్న బిల్ కలెక్టర్లు

విధుల్లో చేరినా ఖాళీగానే వార్డు ఆఫీసర్లు

8

హుండీ ఆదాయం రూ.3.65 లక్షలు

» పోలెపల్లి ఎల్లమ్మ ఆలయంలో లెక్కింపు

దుద్యాల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలెపల్లి ఎల్లమ్మ ఉత్సవాలు 5 రోజుల పాటు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సోమవారం పాంబండ రామలింగేశ్వరస్వామి ఆలయ ఈవో బాలనర్సయ్య ఆధ్వర్యంలో ఆలయ హుండీ సొమ్మును లెక్కించారు. కాగా, ఆదాయం రూ.3,65,534 వచ్చినట్లు ఈవో రాజేందర్‌రెడ్డి తెలిపారు. భక్తులు కానుకల రూపంలో అమ్మవారికి 1,100 గ్రాముల మిశ్రమ వెండిని సమర్పించినట్లు తెలిపారు. 20న ప్రారంభమైన ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. ప్రధాన ఆలయం నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా డప్పుల చప్పుళ్లతో బయలుదేరి గ్రామంలోని ఆలయంలో ఉంచారు.



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అమ్మవారిని దర్శించుకున్న స్పీకర్

పోలెపల్లి ఎల్లమ్మ తల్లిని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సోమవారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతకు ముందు ఆలయ కమిటీ ఆయనకు స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కొడంగల్ తహసీల్దార్ విజయ్‌కుమార్, ఆలయ మేనేజర్ రాజేందర్‌రెడ్డి, చైర్మన్ జయరాములు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

సర్వర్ డౌన్..ఆగిన రిజిస్ట్రేషన్లు

● ఇబ్బందులుపడిన భూ క్రయ, విక్రయదారులు

పరిగి/ఇబ్రహీంపట్నం/చేవెళ్ల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ధరణి పోర్టల్‌లో సర్వర్ సమస్య కారణంగా ఉమ్మడి జిల్లాలో జిల్లాలో పలు చోట్ల సోమవారం రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి. వికారాబాద్ జిల్లాలోని 20 మండలాల్లో ఎక్కడ కూడా రిజిస్ట్రేషన్‌లు జరగలేదు. భూముల రిజిస్ట్రేషన్‌ల కోసం స్లాట్లు బుక్ చేసుకున్న వారంతా రోజంతా తహసీల్దార్ కార్యాలయాల వద్ద పడిగాపులు కాశారు. జిల్లాలో సోమవారం ఒక్కరోజే 120కిపైగా రిజిస్ట్రేషన్‌ల కోసం స్లాట్స్ బుక్ చేసుకున్నారు. సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తిన కారణంగా రిజిస్ట్రేషన్‌లు జరగలేదని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఒక్క పరిగిలోనే 16స్లాట్స్ బుక్ చేసుకున్నా రిజిస్ట్రేషన్‌లు మాత్రం కాలేవు. పోర్టల్‌లో సర్వర్ ప్రాబ్లమ్ సమస్య అంతటా ఉందని ధరణి జిల్లా కో-ఆర్డినేటర్ వెంకటేశ్ తెలిపారు. అలాగే రంగారెడ్డి జిల్లా మంచాలలో భూముల రిజిస్ట్రేషన్లు నిలిపోయాయి. యాచారంలో కేవలం రెండు రిజిస్ట్రేషన్‌లు మాత్రమే జరిగాయి. ఇబ్రహీంపట్నంలో అలస్యమైనప్పటికి స్లాట్ బుకింగ్ ప్రకారం కావాల్సిన రిజిస్ట్రేషన్‌లు పూర్తి చేశారు. వచ్చే నెలలో భూభారతి సాఫ్ట్‌వేర్‌ను ప్రభుత్వం ప్రారంభం చేయనున్నట్లు తెలుస్తుంది. అందుకే అప్పుడప్పుడు సాఫ్ట్‌వేర్ సమస్యలు తలెత్తాయి. చేవెళ్ల డివిజన్ పరిధి చేవెళ్ల మండలంలో 28 డాక్యూమెంట్లు, షాబాద్ మండలంలో 20 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు కాకుండా నిల్చిపోయాయి, శంకర్‌పల్లి మండలంలో 19 డాక్యుమెంట్లకుగాను 8 రిజిస్ట్రేషన్లు చేయగా మిగతా 11డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ కావాల్సి ఉందని అధికారులు పేర్కొన్నారు. అయితే మొయినాబాద్ మండలంలో మాత్రం 20 డాక్యుమెంట్లు రాత్రి వరకు అధికారులు ఉండి రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు. అయితే మిగిలిన మూడు మండలాల్లో మాత్రం ఉదయం నుంచి సాయంత్రం వరకు ధరణిపోర్టల్ సర్వర్ సమస్య వలన రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ల ఎదుట నిరసన


రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రమిస్తున్న జర్నలిస్టులు

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని, ఇళ్ల స్థలాలు కేటాయించాలని, కొత్తగా ఆరోగ్య బీమా పథకాన్ని తీసుకురావాలని టీడబ్ల్యూజేఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సత్యనారాయణ, షైల సైదులు డిమాండ్ చేశారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. తమ డిమాండ్లతో కూడిన ఫ్లకార్డులను ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల విషయంలో సర్కారు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. కొత్త ఆరోగ్య బీమా పథకాన్ని ప్రవేశపెట్టాలని, తదితర సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనంతరంకలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్ జర్నలిస్టుల పిల్లలకు ప్రభుత్వం నిబంధనలు ప్రకారం అన్నీ ప్రైవేట్ విద్యాసంస్థల్లో 50 శాతం రాయితీ ఇచ్చేలా చూడాలని డీఈవో ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు నర్సింహారెడ్డి, అంజనేయులు, నరేష్, మల్లేష్, శేఖర్, సురేష్ పాల్గొన్నారు

మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట..


మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టుల నిరసన

మేడ్చల్ ప్రతినిధి (ఆంధ్రజ్యోతి) : జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని, సమస్యలు పరిష్కరించాలని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి తన్నీరు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టరేట్ ఎదుట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జర్నలిస్టులు హాజరై నిరసన తెలిపారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. హరిప్రసాద్, బెలిదే అశోక్, రోజా రాణి, నర్సింహులుయాదవ్, అశోక్, మల్లేష్‌గౌడ్, గంజికృష్ణ, రామచంద్ర మూర్తి, పాల్గొన్నారు.

ఫార్మాసిటీ రద్దుకోసం కృషి చేస్తాం

యాచారం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): యాచారం మండలంలో ఫార్మాసిటీ రద్దు కోసం కృషిచేస్తామని, భూసేకరణ జరగకుండా చూస్తామని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. సోమవారం మేడిపల్లి, నానక్ నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల రైతులు తీన్మార్ మల్లన్నను నగరంలోని ఆయనను కలిసి తమను ఆదుకోవాలని కోరారు. భూముల వివరాలను నిషేధిత జాబితాలోంచి తీసేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి ఫోన్ చేసి కోరారు. తాను రైతుల పక్షాన పోరాడుతానని హామీ ఇచ్చారు. అనంతరం రైతులు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి గోడు వెల్లబోసుకున్నారు. రైతులకు అన్యాయం జరగకుండా చూస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ కవుల సరస్వతి, రైతులు ఉన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం

కేశంపేట, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమి పక్కన కొంత భూమి కొన్న వ్యక్తి ప్రభుత్వ భూమి కబ్జాకు పూనుకున్నాడు. కడీలు పాతి ఎస్కవేటర్‌తో రాళ్లకు తొలిగిస్తుండగా గ్రామస్తులు అడ్డుకొని రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసిన ఘటన బైర్కాన్‌పల్లిలో సోమవారం చోటుచేసుకుంది. బైర్కాన్‌పల్లిలో సర్వే నంబర్ 53లో డంపింగ్ యార్డు పక్కన 4ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇక్కడ సోలార్ పవర్ ప్లాంట్‌ను వేసేందుకు గతంలోనే గుర్తించారు. గత నెల 21న అధికారులు డంపింగ్ ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ భూమి పక్కనే హైదరాబాద్‌కు చెందిన డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఓ బడా ఉద్యోగికి 10ఎకరాలు ఉంది. దానికి అనుకొనే సర్వే నంబర్ 53/37లో 5భూమి కొన్నాడు. అయితే అతడు ప్రభుత్వ భూమి చదునుకు పూనుకోగా గ్రామస్తులు అడ్డుకున్నారు. రెవెన్యూ, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పెట్రోలింగ్ పోలీసులు చేరుకుని పనులు ఆపాలని సూచించారు. బైర్కాన్‌పల్లి మాజీ సర్పంచ్ రూప్లానాయక్ మాట్లాడుతూ.. సర్వే నంబర్ 53లో ప్రభుత్వ స్థలంలో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు అధికారులు స్థల పరిశీలన చేశారన్నారు. హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి దాన్ని కడీలు పాతి కబ్జా చేస్తున్నాడని తెలిపారు. మరో రైతు అంజయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ భూమిని కాపాడేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. డబ్బు, అధికార బలంలో ఓ వ్యక్తి స్థలాన్ని ఆక్రమించేందుకు చూస్తున్నాడని తెలిపాడు. ఈ విషయమై కేశంపేట తహసీల్దార్ మీర్ ఆజం అలీ మాట్లాడుతూ.. సర్వే నంబరులో 53లో ప్రభుత్వ స్థలంలో పనులు చేస్తున్నారని ఫిర్యాదు రావడంతో వీఆర్‌ఏ పంపామన్నారు. ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పదవుల్లో యువజన కాంగ్రెస్‌కు పెద్దపీట


కేఎల్లార్‌కు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నేతలు

మహేశ్వరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు, నామినేటెడ్ పదవుల్లో యువజన కాంగ్రెస్ నాయకులకు పెద్దపీట వేస్తామని మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలదీ ఇదే ఆలోచనని తెలిపారు. సోమవారం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సుభాన్‌యాదవ్ కేఎల్లార్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఒక్క మన రాష్ట్రంలోనే కాకుండా దేశం మొత్తం యువజన కాంగ్రెస్ నాయకులు కీల భాధ్యతలు అప్పగించాలని రాహుల్‌గాంధీ సీఎంలు, పీసీసీలకు ఆదేశాలు ఇచ్చారన్నారు. కష్టపడ్డ ప్రతీ కార్యకర్తను కాంగ్రెస్ మరిచిపోదన్నారు. కార్యక్రమంలో యువ నాయకులు వెంకటేష్ గౌడ్, రాజు, రవికాంత్‌రెడ్డి, యూనస్ పాల్గొన్నారు.

వేడుకలకు 'వెండికొండ' సిద్ధం


వెండికొండ సిద్దేశ్వరాలయం

శంషాబాద్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి వేడుకలకు శంషాబాద్‌లోని చారిత్రక వెండికొండ సిద్దేశ్వరస్వామి(సిద్దులగుట్ట) ఆలయం ముస్తాబైంది. స్థానికులు, జంటనగరాల భక్తులు నిత్యం ఈ ఆలయానికి వస్తుంటారు. శంషాబాద్‌కు రెండు కిలోమీటర్ల దూరంలోని పాలరాతి కొండ మధ్య ఈ ఆలయం ఉంది. శివలింగానికి అభిషేకంతో ఉత్సవాలు మొదలై ఉపవాసదీక్షతో ముగుస్తాయి. రాత్రి శివపార్వతుల కల్యాణం, భజన మండలి భక్తులతో భజన, జాగరణ కార్యక్రమాలు ఉంటాయి.

కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో శివరాత్రి పూజలు

కొత్తూర్, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని శివనగర్‌లో వెలసిన శ్రీ కాశీవిశ్వనాథస్వామి ఆలయం ముస్తాబైంది. ఈ నెల 26 నుంచి 27వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తారు. వ్యాపారవేత్త దివంగత జాండగూడెం గణపతిగౌడ్ 25ఏళ్ల క్రితం కాశీ నుంచి శివలింగం తెచ్చి సొంత భూమిలో ప్రతిష్ఠించి, ఆలయాన్ని నిర్మించారు. నాటి నుంచి ఈ ప్రాంతాన్ని శివనగర్‌గా పిలుస్తారు. 26న సుప్రభాతసేవ, గణపతిపూజ, దేవతస్థాపన, శరుద్రాభిషేకం, సహస్రబిల్వార్చన, పల్లకిసేవ, అఖండభజన, మహాలింగోద్భవ పూజలు ఉంటాయి. 27న సుప్రభాతసేవ, మంత్రపుష్పము, మహానైవేద్యం, తీర్థప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌తో మేధాశక్తి పెంపు


ఎగ్జిబిట్ల గురించి వివరిస్తున్న విద్యార్థులు

ఆమనగల్లు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లులోని లిటిల్ స్కాలర్స్ హైస్కూల్‌లో సోమవారం వైజ్ఞానిక వస్తు ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. ఎంఈవో పాండు, కరస్పాండెంట్ సుజాతసుదర్శన్‌రెడ్డి, చైర్మన్ అల్లాజీగౌడ్‌లతో కలిసి మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్ మేళాను ప్రారంభించారు. ప్రిన్సిపాల్ శ్రీశైలం, టీచర్ల పర్యవేక్షణలో విద్యార్థులు 100అంశాలపై సైన్స్ ప్రదర్శనలు ఇచ్చారు. 250మంది విద్యార్థులు రూపొందించిన వస్తుసామాగ్రి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు మేధాశక్తి, నైపుణ్యాన్ని చాటాయి. సోలార్‌ఎనర్జీ, ఫిజిక్స్, సహజ విద్యుత్ తయారీ, నీటి పునరుద్ధరణ, 2డీ, 3డీ, నాడీ వ్యవస్థ, రక్తప్రసరణ, జీర్ణ వ్యవస్థ, రక్తపరీక్షల ప్రయోగాలు తదితర ప్రదర్శనలపై విద్యార్థులు సందర్శకులకు వివరించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను, మేధాశక్తిని వెలికి తీసేందుకు ఇలాంటి మేళాలు దోహదంచేస్తాయని ముఖ్య అతిథులు అన్నారు. కార్యక్రమంలో అకడమిక్ అడ్వైజర్ సుదర్శన్‌రెడ్డి, డైరెక్టర్ సావిత్రి, టీచర్లు రేవతి, రమాదేవి, అతస్యర్, మాధురి, అయ్యూబ్, కృష్ణ పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఆమనగల్లు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకుపోవాలని ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు తప్పక ఉంటుందని పేర్కొన్నారు. మండలంలో సోమవారం వంశీచంద్‌రెడ్డి పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈగల్ కమిటీ సభ్యుడిగా నియమితులైన వంశీచంద్‌ను పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ సత్కరించారు. వంశీచంద్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సంసిద్ధం కావాలన్నారు. రాష్ట్రంలో ఎన్నిక ఏదైనా కాంగ్రెస్‌దే విజయమన్నారు. కల్వకుర్తి ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో బిచ్యానాయక్, జగన్, ప్రభాకర్‌రెడ్డి, మానయ్య, రవీందర్‌యాదవ్, ఎం.అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పథకాల పూర్తికి చర్యలు తీసుకోవాలి

ఆమనగల్లు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల పూర్తికి అధికారులు చొరవ తీసుకోవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి కోరారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలన్నారు. ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి మండలాల వ్యవసాయ శాఖ అధికారులతో సోమవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. ఏడీఏగా బాధ్యతలు చేపట్టిన శోభారాణి ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం ఇచ్చారు. సబ్‌డివిజన్ పరిధిలో వ్యవసాయ శాఖ చేపడుతున్న కార్యక్రమాలను ఏవోలు ఎమ్మెల్యేకు వివరించారు. ఆరు తడి పంటల సాగు, పామాయిల్‌తో లాభాల గుర్చిరైతులకు వివరించాలని ఆయన ఆదేశించారు. సబ్సిడీ స్ప్రింక్లర్లను రైతులు వినియోగించుకునేలా చూడాలన్నారు. పంటలకు మద్దతు ధర, సబ్సిడీలు, బోనస్‌పై వివరించాలన్నారు. వేసవిలో ఆరుతడి పంటలే వేసుకునేలా చూడాలన్నారు. ఏడీఏ కార్యాలయానికి నూతన భవనం నిర్మించాలని అధికారులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఏవోలు శ్రీనివాస్‌గౌడ్, శ్రీలత, అరుణకుమారి, రేణుక పాల్గొన్నారు.

భూకైలాస్‌లో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

రేపు శివుడిని దర్శించుకోనున్న మహారాష్ట్ర మంత్రి సంజయ్ రాథోడ్


ఆలయంలోని శివలింగం

తాండూరు రూరల్, ఫిబ్రవరి 24, (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లాలోని తాండూరు మండలం అంతారం తండాలోని భూకైలాస్ ఆలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకొని సోమవారం బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. గణపతిపూజ, సర్వదేవతలకు అభిషేకాలు నిర్వహించారు. నేడు(మంగళవారం) గౌరిపూజ, గంగపూజ, యాగశాల ప్రవేశం, మంటపారాధన, ధ్వజారోహణం, అగ్నిప్రజ్వలన, గణపతిహోమం నిర్వహిస్తారు. 26న మహాశివరాత్రిని పురస్కరించుకొని మహారాష్ట్ర భూగర్భ, జలవనరుల శాఖ మంత్రి సంజయ్ రాథోడ్ హెలీకాప్టర్ ద్వారా భారీ శివుడిపై పూలవర్షం కురిపించేందుకు ఏర్పాట్లు చేశారు. మంత్రి భూకైలాస్ ఆలయంలో రెండు గంటలపాటు ప్రత్యేక పూజల్లో పాల్గొననున్నారు. ఇప్పటికే ఇందుకు సంబందించి ఆలయ వ్యవస్థాపకులు వాసుపవార్ నాయక్, ఆయన సోదరుడు ఆల్ ఇండియా బంజారా సంఘం అధ్యక్షుడు శంకర్‌నాయక్‌లు అనుమతి పత్రాన్ని తాండూరు డీఎస్పీ, టౌన్ సీఐ కి అందజేశారు.

కీసరగుట్ట బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

(ఐదో పేజీ తరువాయి)

ఉత్సవమూర్తులు పల్లకీ సేవలో నడకదారిన కీసరగుట్ట చేరుకున్న అనంతరం శ్రావణ నక్షత్రయుక్త తుల లగ్నమందు స్వామి కల్యాణం నిర్వహించనున్నారు.

క్రీడలకు అధిక ప్రాధాన్యం


కలెక్టర్ గౌతమ్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ నిర్వాహకులు

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించే క్రీడా పోటీలను స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడలకు ప్రాధాన్యత కల్పిస్తున్నామన్నారు. ప్రతిభావంతులను వెలికితీసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు.

మండుటెండల్లో విద్యార్థుల పడిగాపులు

ప్రతీ సంవత్సరం నిర్వహించే పోటీల ప్రారంభోత్సవంలో విద్యార్థులకు మాత్రం ఇక్కట్లు తప్పడం లేదు. ఈ సందర్భంగా నిర్వహించే మార్చ్‌ఫాస్ట్‌కు జిల్లాలోని వివిధ పాఠశాల నుంచి విద్యార్థులు మైదానానికి తీసుకొస్తారు. ఈ క్రమంలో క్రీడా పోటీలను ప్రారంభించే ముఖ్య అతిథి కోసం విద్యార్థులకు గంటల తరబడి ఎదురుచూపులు తప్పడం లేదు. సోమవారం ప్రారంభోత్సవానికి శివసేన రెడ్డి ఆలస్యంగా రావడంతో పోటీలు మధ్యాహ్నం ప్రారంభించారు. దీంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మండుటెండలో విద్యార్థులు పడిగాపులు కాయాల్సిన దుస్థితి.

బస్సు ప్రాంగణం ప్రారంభం

కీసరగుట్టలో గ్రేటర్ హైదరాబాద్ ఆర్టీసీ ఈడీ రాజశేఖర్ సోమవారం బస్సు ప్రాంగణాన్ని ప్రారంభించారు. కుషాయిగూడ, చెంగిచెర్ల, కంటోన్మెంట్ ఉప్పల్, హకీంపేట, రాణిగంజ్ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆయన తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి: సీపీ సుధీర్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు

బ్రహ్మోత్సవాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు అన్నారు. ఈ మేరకు సోమవారం కీసరగుట్టలో ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహించొద్దన్నారు. మహిళల పట్ల ఆకతాయిలు చేసే అల్లరి పనులను, దొంగతనాలు, నివారించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలను అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించి జాతరను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మల్కాజిగిరి డీసీపీ పద్మజా, ఐపీఎస్ డీసీపీ క్రైమ్ అరవింద్ బాబు, ఐటీ సెల్ ఏసీపీ నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనల మేరకు ఇంటి నిర్మాణం చేపట్టాలి

కులకచర్ల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనల మేరకు ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేపట్టాలని ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన మండలంలోని అనంతసాగర్ గ్రామంలో సోమవారం లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామానికి 163 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. మొదటగా స్థలం ఉన్న వారు నిర్మించుకోవాలన్నారు. మూడు విడతలుగా బిల్లు మంజూరవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈఈ సయ్యద్ మక్రంబాబా, ఏఈ సందాని, కార్యదర్శి శ్రీనివాస్, గ్రామస్థులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

కులకచర్ల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మన ఊరు, మన బడి కార్యక్రమంలో చేపట్టిన పనులకు బిల్లులు అందించాలని మండలంలోని వివిధ గ్రామాల మాజీ విద్యా కమిటీ చైర్మన్లు కోరారు. వికారాబాద్‌లో ట్రెయినీ కలెక్టర్ ఉమాహారతిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అప్పులు చేసి లక్షల్లో పనులు చేపట్టామని, చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బిల్లులు మంజూరు చేయాలని కోరారు.

విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి

కులకచర్ల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని స్థానిక బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జైపాల్‌రెడ్డి అన్నారు. కులకచర్లలో సోమవారం మ్యాజిక్ బస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. మహిళలకు పలు కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఎంపీవో భాస్కర్‌గౌడ్, హెల్త్ అసిస్టెంట్ వెంకట్, చాకలి వెంకటేశ్, నర్సిములుగౌడ్ పాల్గొన్నారు.

దళితులపై వివక్ష చూపేవారిపై చర్యలు తీసుకోవాలి



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న దళిత సంఘాల సభ్యులు

శామీర్‌పేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : దళితులపై వివక్ష చూపుతూ రోడ్లకు అడ్డుగా నిర్మాణాలు చేసిన తిరుమల కాలనీ వాసులపై కఠిన చర్యలను తీసుకోవాలని తెలంగాణ దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాంమోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయాంజాల్‌లో తిరుమల కాలనీ వాసులు దళితులు నివాసముంటున్న కాలనీలో రాకపోకలు సాగించే రోడ్లకు అడ్డుగా నిర్మాణాలు చేసి రాకపోకలను బంద్ చేశారు. ఈ నిర్మాణాలను తొలగించి దళితులు రాకపోకలు సాగించేలా చూడాలని సోమవారం దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాంమోహన్ ఆధ్వర్యంలో దేవరయాంజాల్ నుంచి తూంకుంటలోని మున్సిపల్ కార్యాలయం వరకు దళిత సంఘాల సభ్యులు, దళిత కాలనీ వాసులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్ శ్రావణ్‌కుమార్‌ను కలిసి ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు.

గురుకుల విద్యాలయ ఆస్తులను పరిరక్షించాలి


ఉత్తరాన్ని పోస్టు చేస్తున్న టీడీపీ నాయకులు

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లోని గురుకుల్ విద్యాలయ ఆస్తులను పరిరక్షించడంతో పాటు ఘట్‌కేసర్‌లోని రైల్వేవంతెన నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయాలని తెలుగుదేశం పార్టీ మండల నాయకులు సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డు పంపారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు వేముల సంజీవ గౌడ్, సిస్టా సూర్యనారయణ మాట్లాడుతూ ఘట్‌కేసర్‌లోని గురుకుల్ విద్యాలయానికి చెందిన స్థలం ఆక్రమణలకు గురవుతుందని తెలిపారు. ఈ విద్యాలయానికి నగరంలోని హైటెక్ సిటీ, కొండాపూర్ ప్రాంతాల్లో దాదాపు 627 ఎకరాల భూమి ఉన్నప్పటికీ ఇక్కడ మాత్రం కనీస సౌకర్యాలు లేవని గుర్తు చేశారు. అలాగే ఘట్‌కేసర్‌లోని కొండాపూర్ రైల్వే వంతెన నిర్మాణ పనులు ఏళ్లపాటు కొనసాగుతుండటం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఇప్పటికైన పై సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని కోరారు.

తహసీల్దార్ కార్యాలయంలో కుర్చీలన్నీ ఖాళీ

కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య

యాలాల, ఫిబ్రవరి 24, (ఆంధ్రజ్యోతి) : యాలాల తహసీల్దార్ కార్యాలయంలో కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య ఆరోపించారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సిబ్బంది కొరత కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రోజుల తరబడి ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా రైతుల విరసత్, పట్టా మార్పులు కోసం వచ్చేవారు అధికారులు లేక ఉసూరుమంటూ తిరిగి వెళ్లిపోతున్నారని వాపోయారు. కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్, గిర్దావర్, మండల సర్వేయర్, కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం తహసీల్దార్, గిర్దావర్, కొంతమంది సిబ్బంది మాత్రమే ఉన్నారన్నారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో కూడా పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయని చెప్పారు. వీటిని వెంటనే భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేేదంటే కేవీపీఎస్ ఆధ్వర్యంలో కలెక్టర్ ఎదుట పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో కేవీపీఎస్ నాయకులు నర్సింహులు, శివప్ప, రవి పాల్గొన్నారు.

కల్తీ పదార్థాలపై అవగాహన ఉండాలి

మహేశ్వరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కల్తీ ఆహార పదార్థాలను గుర్తించేలా ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని రసాయణ శాస్త్ర విభాగాధిపతి దయానంద్, ఆహార కల్తీనిర్ధారణ రిటైర్డ్ అధికారి లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం మహేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామం, పట్టణం, నగరం ఇలా ఎక్కడ చూసినా ఆహార పదార్థాల కల్తీ ఎక్కువైందన్నారు. ప్రతీ విద్యార్థి కల్తీ ఆహార పదార్థాలను గుర్తించేలా అవగాహన ఉండాలన్నారు. వ్యాధులకు మూలం కల్తీ ఆహారమే అన్నారు. విద్యార్థి దశ నుంచే కల్తీ ఆహార పదార్థాలను గుర్తించేలా అవగాసను పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్, ఇంతియాజుద్దీన్, శ్రీదేవి, నరేందర్‌రెడ్డి, శ్రీహరి, జహీదాబేగం, ఫర్హాజ్, సునీత, సుమతి, రమేష్ పాల్గొన్నారు.

రాజరాజేశ్వరాలయం ముస్తాబు

» మహాశివరాత్రికి ఏర్పాట్లు

పూర్తి చేసిన ఆలయ కమిటీ



మహేశ్వరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మహేశ్వరంలోని శ్రీ శివగంగా రాజరాజేశ్వరాలయం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. నేటి నుంచి మార్చి 1వ తేదీ వరకు కొనసాగే బ్రహ్మోత్సవాలకు ఆలయాన్ని అలంకరించారు. ఆలయం మధ్యలో ఉన్న కోనేటిలో భక్తులు స్నానమాచరిస్తారు. ఐదు రోజులు నిర్వహించే జాతరకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తిచేశారు. మహేశ్వరం, మిధాని, షాద్‌నగర్, ఫలక్‌నుమా డిపోల నుంచి ఆర్టీసీ బస్సులు నడుపుతారు. బ్రహ్మోత్సవాల వివరాలను ఆలయ ఈవో మురళీకృష్ణ, కమిటీ చైర్మన్ అల్లెకుమార్ వివరించారు. 25 గణపతిపూజ, పుణ్యాహ: వచనం, ధ్వజారోహణం, 2న మహాశివరాత్రి రుద్రాభిషేకం, కుంకుమార్చన, బిల్వార్చన, మహా మంగళహారతి, సాంస్కృతిక కార్యక్రమాలుంటాయి. 27న రాజరాశ్వరస్వామి రుద్రాభిషేకాలు, శివపార్వతుల కల్యాణం, 28న స్వామివారి రుద్రహోమం, రథోత్సవం, మార్చి 1న లలితాసహస్రపారాయణం, దోపోత్సవం ఉంటాయని తెలిపారు.

250 మంది పోలీసులతో బందోబస్తు

బ్రహ్మోత్సవాలకు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశామని మహేశ్వరం సీఐ హెచ్. వెంకటేశ్వర్లు తెలిపారు. ఏడుగురు సీఐలు, 32మంది ఎస్సైలు, ఒక ఏడీసీపీ, ఒక డీసీపీ మొత్తం 250మంది సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. విధుల్లో ఉండే పోలీసు సిబ్బందికి భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు సహకరించాలన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

వికారాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి సందర్భంగా జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు 109 ఫిర్యాదులను సమర్పించాలని, వాటిలో ధరణికి సంబంధించి భూ సమస్యలు, ఆసరా పింఛన్లు, ఇరిగేషన్, భూ సర్వే ఇతర సమస్యలకు సంబంధించి దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. భూ సమస్యలకు సంబంధించి ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేసి రిపోర్ట్ పంపించాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, ఆర్‌డీవో వాసుచంద్ర, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మేడ్చల్ ప్రతినిధి: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.ఫిర్యాదులపై చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలన్నారు. 64 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లా ఆఫీసర్ చంద్రావతి, డీఆర్‌ఓ హరిప్రియ పాల్గొన్నారు.

కాగా ప్రజావాణికి జిల్లా అధికారులు హాజరుకాకపోవడంపై అదనపు కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అసిస్టెంట్‌లను పంపడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ప్రజావాణికి జిల్లా అధికారులు తప్పకుండా హాజరుకావాలని ఆదేశించారు.

ఏఐ తరగతులను వినియోగించుకోవాలి


గడిసింగాపూర్ స్కూల్‌లో ఏఐ క్లాసును ప్రారంభించిన అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి

పరిగి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఏఐ తరగతులను విద్యార్థులు వినియోగించుకోవాలని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి అన్నారు. మండలంలోని గడిసింగాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డిజిటల్ క్లాసులను ప్రారంభించారు. ఏఐ తరగతులను బోధించేందుకు త్వరలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో రేణుకాదేవి, ఏఎంవో రామమస్తాన్, ఎంఈవో గోపాల్, హెచ్ఎంలు అనంతరావు, వెంకట్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దోమ: మండలంలోని బొంపల్లి ప్రాథమిక పాఠశాలలో 3 నుంచి 5 తరగతుల విద్యార్థులకు డిజిటల్ తరగతుల బోధన, కంప్యూటర్ ల్యాబ్‌ను సోమవారం ట్రెయినీ కలెక్టర్ ఉమాహారతి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏఎస్‌వో రమేశ్, ఎంఈవో వెంకట్, ప్రధానోపాధ్యాయుడు ఎండీ.షఫీ, ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో నరేందర్, ఆర్ఐ సురేందర్, పంచాయతీ కార్యదర్శి మీనా, పాఠశాల చైర్ పర్సన్ నసీమ్, సీఆర్‌పీ వెంకటేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోట్‌పల్లి: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని మండల విద్యాధికారి చంద్రప్ప అన్నారు. మండల పరిధిలోని ఎన్నారం ప్రాథమిక పాఠశాలలో ఏఐ ల్యాబ్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ రామ్ కిషోర్, సీఆర్‌పి నర్సింహులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం శారద, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మళ్లీ మొదటికే!

- గతి తప్పిన వికారాబాద్ మున్సిపాలిటీ
- బిల్‌కలెక్టర్ల చేతివాటం
- ఇంటి నంబర్ల కోసం ముడుపులు
- విధుల్లో చేరినా ఖాళీగానే వార్డు ఆఫీసర్లు

వికారాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ మున్సిపల్ అధికారుల తీరు మళ్లీ మొదటికే వచ్చిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో బిల్లు కలెక్టర్లు చేతివాటం చూపించి ఇంటినెంబర్లు, మోటేషన్లకు ప్రజల నుంచి దండిగా వసూళ్లు చేయడం, వందలాది ఫైల్స్ పెండింగ్‌లో పెట్టడం వంటివి చేశారు. అయితే అప్పట్లో చైర్‌పర్సన్ దృష్టికి సమస్య వెళ్లడంతో ప్రత్యేక చొరవ తీసుకుని 250 ఫైచిలుకు ఫైళ్లను క్లియర్ చేయించారు. ఇంటినెంబర్లు, మ్యుటేషన్ కోసం ఆర్ఐ, ఆర్‌వో, కమిషనర్ లాగిన్లలో వాటిని పూర్తిచేయాల్సి ఉంటుంది. అయితే వాటిని పూర్తి చేసేందుకు బిల్లు కలెక్టర్ స్థాయి నుంచే వసూళ్లు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. ఇంటి నెంబర్లు, మ్యుటేషన్లు దరఖాస్తు చేసుకున్న 20 రోజుల్లో పూర్తి కావాల్సి ఉన్నా నెలల తరబడి పెండింగ్‌లో పెడుతున్నారు.

కొత్త సంవత్సరంలో 34 దరఖాస్తులు

జనవరి 1 నుంచి ఇప్పటి వరకు ఇంటి నెంబర్ల కోసం 34 దరఖాస్తులు కాగా మ్యుటేషన్ కోసం 8 దరఖాస్తులు వచ్చాయి. అందులో 21 ఇంటి నెంబర్లు, 4 మ్యుటేషన్లు పూర్తిచేసినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఎవరు ముందు డబ్బులిస్తే వారివి మాత్రమే త్వరగా పూర్తి చేస్తున్నారని, డబ్బులు రాని వాటిని అలాగే పెండింగ్‌లో పెడుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు కట్టుకునే ఇళ్ల వద్ద డబ్బులు వసూలు చేసి వారిని ఇబ్బందులకు గురిచేయడమేంటని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఒక్కో ఇంటికి రూ.10వేల నుంచి లక్ష వరకు వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.


వికారాబాద్ మునిసిపాలిటీ కార్యాలయం

ప్రక్షాళన కోసం మార్పులు

చైర్‌పర్సన్ మంజుల రమేష్ ఉన్న సమయంలో మున్సిపాలిటీలో సిబ్బంది ఎవరికి వారే యమున తీరే అన్నట్లుగా వ్యవహరిస్తూ అవినీతికి పాల్పడుతున్నారని గ్రహించి కొన్నేళ్లుగా ఆయా శాఖల్లో పాతుకపోయిన సిబ్బందిని వేరే విభాగాలకు మార్చే ప్రయత్నం చేశారు. వారి పదవీ కాలం పూర్తయిన కొద్ది రోజులకే మళ్లీ పాత పద్ధతికి సిబ్బంది మారిపోయారు. తమకు కొత్త పనులు అర్థం కావడం లేదని, దీంతో పనులు ఆగిపోతున్నాయని ఓక సాకు చూపించి మళ్లీ వారి పాత స్థానాలకు చేరుకుని మళ్లీ అవినీతికి పాల్పడుతున్నారు. మున్సిపాలిటీలో ఈ శాఖ ఆ శాఖ అనే తేడా లేకుండా ప్రతీశాఖలో అవినీతి రాజ్యమేలుతున్న పట్టించుకునే నాథుడే లేకుండా పోయారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఖాళీగానే వార్డు ఆఫీసర్లు

గ్రూప్ 4 ద్వారా నియామకమైన వార్డు ఆఫీసర్లు వికారాబాద్‌కు 30మంది నియామకం కాగా, ఇద్దరు జూనియర్ అకౌంటెంట్‌లు వచ్చారు. ఇందులో వార్డు ఆఫీసర్ ఒకరు రిపోర్ట్ చేయలేదు. అయితే రెండు నెలల కిందట వచ్చిన వార్డు ఆఫీసర్లు ఏమీ చేయడంలేదు. రోజూ కార్యాలయానికి వస్తున్నారే గానీ వారికి సంబంధించిన పనులపై ఇంకా స్పష్టత లేదు.

మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం

బిల్లు కలెక్టర్లు ఇంటి నంబర్ల కోసం డబ్బులు వసూలు చేస్తున్నారని మా దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. త్వరితగతిన దరఖాస్తు చేసుకున్న వారికి నెంబర్లు కేటాయిస్తాం. బిల్లు కలెక్టర్లు విధులు నిర్వహిస్తున్నారు ఖాళీగా కూర్చుంటున్నారనేది అవాస్తవం. సిబ్బందిని ఆయా విభాగాలకు గతంలో మార్చడంతో వారు అక్కడ పనిచేయడానికి కొంత ఇబ్బంది పడ్డారు. దాన్ని దృష్టిలో ఉంచుకుని మళ్లీ పాత విభాగాలకు మార్చాం. - కమిషనర్ జాకీర్ హుస్సేన్

ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు


ఘట్‌కేసర్: పోచారంలో స్పటిక లింగేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి పూజలు

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని పోచారంలోని సర్వ మంగళా సమేత స్పటిక లింగేశ్వర స్వామి ఆలయ సప్తదశ(17)వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా బద్దం జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు ఆలయకమిటీ సభ్యులు కృషి చేయాలన్నారు. ఆయనకు ఆలయ కమిటీ నిర్వాహకులు ఆయన పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పూజారులు ఆయనను ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. అంతకు ముందు ధ్వజారోహణం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు చెరుకు సరితా బద్రి నారాయణ గౌడ్ దంపతులు, నాయకులు మెట్టు బాల్‌రెడ్డి, సామల బుచ్చిరెడ్డి, బద్దం శ్రీనివాస్‌రెడ్డి, సింగిరెడ్డి సాయిరెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.

మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం

మేడ్చల్ టౌన్: మండలంలోని రావల్‌కోల్ మల్లికార్జున స్వామి వారి కల్యాణోత్సవం సోమవారం అంగరంగ వైభవరంగా జరిగింది. ప్రతీ సంవత్సరం నిర్వహిచే ఈ ఉత్సవంలో పాల్గొనటానికి మండలంలోని గ్రామాల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి రూరల్ జిల్లా మాజీ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి, బీజేపీ మేడ్చల్ పట్టణ అధ్యక్షురాలు శైలజ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.


రావల్‌కోల్ మల్లికార్జున స్వామిని దర్శించుకున్న బీజేపీ నాయకులు

కీసరకు ప్రత్యేక బస్సులు

మహాశివరాత్రి సందర్భంగా కీసరగుట్ట ఆలయాన్ని దర్శించుకునే భక్తుల కోసం ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు స్థానిక ఆర్టీసీ అధికారులు తెలిపారు. మొదటి సర్వీసు ఉదయం 8గంటల నుంచి మేడ్చల్ డిపో నుంచి బయలు దేరి సుచిత్ర, ఈసీఐఎల్ చౌరస్తా మీదుగా కీసరగుట్ట చేరుకుంటుందన్నారు. అదేవిధంగా రాత్రి 9గంటల 25నిమిషాలకు కీసరగుట్ట నుంచి చివరి బస్సు సీర్వీస్ మేడ్చల్ డిపోకు బయల్దేరుతుందని తెలిపారు.

ఆలయంలో మాజీ ఎమ్మెల్యే పూజలు

వికారాబాద్: పట్టణంలోని మణికంఠ కాలనీలో కొలువైన హనుమాన్ ఆలయం రెండో వార్షికోత్సవం సందర్భంగా కాలనీవాసులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకల్లో వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ హాజరై స్వామి వారిని దర్శించుకోగా కాలనీ వాసులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అనంత్ రెడ్డి, గోపాల్, మేక చంద్రశేఖర్ రెడ్డి, పాండు, తదితరులు పాల్గొన్నారు.

అంకుశాపూర్‌లో వైభవంగా బోనాలు

ఘట్‌కేసర్ రూరల్: అంకుశాపూర్‌లో శ్రీ మల్లికార్జున స్వామికి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. శ్రీ మల్లికార్జున స్వామి శ్రీరేణుకా ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం సందర్భంగా సోమవారం యాదవ సంఘం ఆధ్వర్యంలో బోనాలు ఏర్పాటు చేశారు. ఒగ్గు కళాకారుల డోలు వాయిద్యాల మధ్య శివసత్తులు పూనకాలు, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఒగ్గు కళాకారుడు అశోక్ బృందం మల్లికార్జున స్వామి, రేణుకల ఎల్లమ్మ తల్లి ఒగ్గు కథను చెప్పారు. భక్తులకు పిట్టల రాజు, మేడబోయిన రాజు, కొత్తకాపు జైపాల్ రెడ్డి, బద్దం కార్తిక్‌రెడ్డిలు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు, గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

జాతరకు ముస్తాబైన ఆలయం

కోట్‌పల్లి: మహాశివరాత్రిని పురస్కరించుకుని ఇందోల్‌లోని లింగమయ్య ఆలయం జాతరకు ముస్తాబైంది. 100 సంవత్సరాల చరిత్రగల ఈ ఆలయం బుధవారం ఆలయం నుంచి గ్రామం వరకు తేరు, గురువారం ఉదయం 11గంటలకు పార్వతీ పరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో శివలింగ ప్రతిష్ఠాపన

తాండూరు రూరల్: చంద్రవంచ గ్రామ శివారులోని శ్రీపల్లెగూడ హనుమాన్ ఆలయం వద్ద జైభారత్ మాతా సేవాసమితి న్యూ ఢిల్లీ ఆధ్వర్యంలో హవా మల్లినాథ్ మహరాజ్ నిరుగుడి అధ్యక్షతన దేశంలో 7,663వ శివలింగ ప్రతిష్ఠాపన చేశారు. సోమవారం శ్రీగురు హవా మల్లినాథ్‌మహరాజ్ ప్రత్యేక పూజలు నిర్వహించి నూతన శివలింగాన్ని ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో ప్రతిష్ఠించారు. చిట్టిఘనాపూర్ గ్రామానికి చెందిన అగ్గనూరు శోభావతి, అగ్గరునూరు అశోక్‌కుమార్‌లు గత కొన్ని రోజుల కిందట మల్లినాథ్ మహరాజ్ అధ్యక్షతన 10 గుంటల భూమిని శివలింగ స్థాపనకు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో దర్శిది రవి శంకర్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీకాంత్‌గౌడ్, బోయ అశోక్‌కుమార్, విజయ్‌కుమార్, అశోక్‌రెడ్డి, బాలేశ్వర్‌గౌడ్, అగ్గనూరు శోభావతి, అశోక్‌కుమార్, వీరయ్య పంతులు, అంజిలప్ప, నర్సింహులు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.


తాండూరు రూరల్: ఆంజనేయస్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన శివలింగం వద్ద పూజలు

ధారూరు ఎస్ఐగా అనిత



ధారూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ధారూరు ఎస్ఐగా అనిత సోమవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. వికారాబాద్ ఎస్ఐగా పని చేసిన ఆమె ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ ఈనెల 11న ఏసీబీకి పట్టుబడి రిమాండ్ అయిన విషయం తెలిసిందే. దీంతో హైదరాబాద్ మల్టీజోన్ 2 ఐజీ సత్యనారాయణ ఎస్ఐని సస్పెండ్ చేశారు. ఖాళీగా ఉన్న పోస్టులో అనితను నియమిస్తూ పోలీస్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

సేవలోనే నిజమైన సంతృప్తి

వికారాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : తాను చదివిన పాఠశాలకు సేవ చేయడంలోనే నిజమైన సంతృప్తి ఉందని బాల వికాస స్వచ్ఛంద సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింగారెడ్డి శౌరిరెడ్డి అన్నారు. పట్టణంలోని సెయింట్ జ్యూడ్స్ ప్రైమరీ స్కూల్‌కు సోమవారం 500 లీటర్ల సామర్థ్యం గల ప్యూరిఫికేషన్ వాటర్ ప్లాంట్‌ను ఆయన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఉషారాణి, రిటైర్డ్ పీఈటీ రాజారెడ్డి, శౌరి రెడ్డి, చిన్ననాటి స్నేహితులు డాక్టర్ భక్తవత్సలం, జీవీకే రెడ్డి, శరత్ చంద్రరెడ్డి, ఫయాజ్, వహీద్, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు


సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న నాయకులు

దోమ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని డీసీసీ ఉపాధ్యక్షుడు రాకొండ అంతిరెడ్డి అన్నారు. బొంపల్లిలో రూ.5లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, అండర్‌డ్రైనేజీ, తాగునీటి వసతి పనులు చేపడుతున్నామని తెలిపారు. ఎలాంటి సమస్య ఉన్నా వాటిని గుర్తించి అవసరమైన నిధులు సమకూరుస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గండె రాములు, నాయకులు నర్సింహారెడ్డి, డాక్టర్ సత్తయ్య, మహమ్మద్, గఫూర్, బాబు, జంగయ్య, ముద్దం బాల్‌రాజ్, రాము, శేఖర్, రమేశ్, భాస్కర్, ఇంతియాజ్, భీమయ్య, మహేశ్, యాదయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.

తవ్వుకునోళ్లకు.. తవ్వుకున్నంత!

(5వ పేజీ తరువాయి)

కావడంతో వారిని బెదిరించి మరీ అక్కడి నుంచి పంపించినట్లు సమాచారం. అనుమతిలేని దందా కాబట్టి రాత్రికిరాత్రే వాహనాలను అక్కడి నుంచి తప్పించారు. అన్‌లోడ్ చేసిన మట్టి ఆనవాళ్లు సైతం లేకుండా చేశారు. అంటే మట్టి వ్యాపారం ఏ స్థాయిలో జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. వ్యాపారులకు పోలీసులు కూడా సహకరించడంతోనే తెల్లవారేసరికి ఏం జరుగనట్లుగా చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పెద్ద ప్రమాదం జరిగినా.. ఏం జరగనట్లు చేశారంటే వారు ఎలా వ్యవస్థలను మేనేజ్ చేస్తున్నారో తెలుస్తోంది. ఇలా ఒకటా, రెండా చీకటి పడిందంటే చాలు మట్టి తరలించే వాహనాలు రోడ్లపై చక్కర్లు కొడుతున్నాయి. దీంతో రాత్రి వేళ రోడ్డుపైకి రావాలంటేనే స్థానికులు జంకుతున్నారు.

రూ.లక్షల్లో ఆదాయం గడిస్తూ..

మట్టి దందా పరిధిలోకి వచ్చే శాఖల అధికారులకు అడిగినంతా ఇస్తుండటంతో వారు తమకేందుకులే అన్నట్లు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. వ్యాపారులు నిత్యం లక్షల్లో అక్రమంగా సంపాదిస్తూ, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. మట్టే కదా.. అదేం.. చేస్తారని అనుకోవచ్చు. కానీ ఆ వ్యాపారంలోనే ఉంది మతలబు అని స్థానికులు చర్చించుకుంటున్నారు. చీకటి పడిందంటే చాలు దందాకు తెరలేపుతున్నారు. గుట్టలు, చెరువులను, కట్టలను కూడా వదలడం లేదు. రాత్రింబవళ్లు తవ్వకాలు జరిపి సొరంగాలుగా మారుస్తున్నారు. ఈ తవ్వకాలు ప్రభుత్వ భూముల్లోనే ఎక్కువగా జరుపుతున్నారు. మట్టిని నిబంధనలకు విరుద్ధంగా టిప్పర్లు, ట్రాక్టర్లు, లారీల ద్వారా అక్రమంగా తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. నామ్‌కేవాస్తే నాలుగైదు ఎకరాల అనుమతి పొంది వందల ఎకరాల్లో మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. రెవెన్యూ, మైనింగ్, పోలీస్ శాఖ అధికారులు, వ్యాపారులు కుమ్మక్కై మట్టి తరలింపును నిరాటకంగా సాగిస్తున్నారు.

అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే..

పరిగి పట్టణ ప్రాంతంలో కొనసాగుతున్న ఈ మట్టి దందా ప్రధాన రాజకీయ పార్టీల నాయకుల కనుసన్నల్లోనే జరగుతున్నట్లు తెలుస్తోంది. వ్యాపారంలో ఒకరిపైఒకరు గిట్టని వారు అధికారులు పరస్పర ఫిర్యాదులు చేసుకుంటున్నారు. ఆ తర్వాత తిరిగి సెటిల్‌మెంట్లు చేసుకుంటున్నారు. మట్టి దందా పంచాయతీలను ప్రభుత్వ కార్యాలయాల్లోనే సెటిల్ చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అధికార పార్టీ నేతలే ఈ అక్రమ వ్యాపారాన్ని నడిపిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సంక్షిప్తంగా..

ఇసుక ట్రాక్టర్లు సీజ్

దోమ: దిర్సంపల్లి ఉన్నత పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణానికి తహసీల్దార్ కార్యాలయం నుంచి అనుమతులు పొంది మరో ప్రాంతానికి ఇసుక తరలించిన రెండు ట్రాక్టర్‌లను సీజ్ చేసినట్లు ఎస్ఐ ఆనంద్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అక్రమంగా ఎవరైనా ఇసుకను తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ ఇసుక రవాణాను ఉపేక్షించేది లేదన్నారు.

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

ఘట్‌కేసర్ రూరల్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఘనాపూర్‌లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని బొక్కొనిగూడకు చెందిన బొక్క కృష్ణారెడ్డి సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సర్వేనెంబర్లు 1140, 1141 కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇంజనీరింగు కళాశాల యాజమాన్యం అనుమతులు తీసుకోకుండ నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. గతంలో ఇట్టి అక్రమ నిర్మాణాలపై అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. 2వేల గజాలలో నిర్మాణాలు చేపడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండికోడుతున్నారని తెలిపారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉచిత కంటి పరీక్ష శిబిరం

కొడంగల్ రూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో లయన్స్‌క్లబ్ ఆఫ్ కొడంగల్, జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ, తెలంగాణ వైద్య విధాన పరిషత్, లయన్స్‌క్లబ్ కందూరి రాంరెడ్డి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆఫ్తాల్మిక్ వైద్యుడు హరినాథ్‌నెహ్రూ 115మందికి పరీక్షలు నిర్వహించారు. 38మందికి కంటి శుక్లాల లోపాలు గుర్తించి మహబూబ్‌నగర్ కందూరి రాంరెడ్డి ఆస్పత్రికి రెఫర్ చేశారు.

పైపులైన్ లీకేజీలుంటే ఫిర్యాదు చేయాలి

మోమిన్‌పేట్: మండలంలోని ఎన్కతల గ్రామంలో సోమవారం తాగునీటి పైపులైన్ లీకేజీలకు పంచాయతీ కార్యదర్శి నర్సింహులు మరమ్మతులు చేయించారు.

అనారోగ్యంతో మాజీ ఎంపీటీసీ మృతి

మోమిన్‌పేట్: టేకులపల్లి గ్రామ మాజీ ఎంపీటీసీ వర్త్య పర్త్యనాయక్ సోమవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదివారం రాత్రి భోజనం చేసి నిద్రించగా సోమవారం ఉదయం కుమారుడు సుభాన్ వెళ్లి చూడగా మృతిచెందినట్లు గుర్తించారు. పర్త్యనాయక్ టీడీపీ హయాంలో ఎంపీటీసీగా బాధ్యతలు నిర్వర్తించారు.

మరో కీచక టీచర్?

- విద్యార్థినుల పట్ల ఉపాధ్యాయుడి అసభ్యకర ప్రవర్తన
- ఎంఈవోకు ఫిర్యాదు.. విచారణతో సరిపెట్టిన వైనం

వికారాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ధారూరు మండలంలో కీచక ఉపాధ్యాయుడి ఉదంతం మరువక ముందే జిల్లాలో మరో కీచక ఉపాధ్యాయుడి ఉదంతం వెలుగులోకి వచ్చింది. వికారాబాద్ మండల పరిధిలోని ఓ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఓ ఉపాధ్యాయుడు పాఠశాలలో చదివే విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పాఠశాల విద్యార్థినులు తమ పట్ల ఆ ఉపాధ్యాయుడు వ్యవహరిస్తున్న తీరుపై తమ తల్లిదండ్రులకు వివరించి కన్నీటి పర్యంతమైనట్లు తెలుస్తోంది. విద్యార్థినుల పట్ల ఉపాధ్యాయుడు అసభ్యకరంగా వ్యవహరిస్తున్న తీరుపై తల్లిదండ్రులు మండల విద్యాధికారికి ఫిర్యాదు చేయగా, ఆయన వచ్చిన ఫిర్యాదుపై విచారణ జరపాల్సిందిగా కాంప్లెక్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడికి సూచించారు. కాగా, ఉపాధ్యాయుడు విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా వ్యవహరించిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా వ్యవహరించిన తీరుపై విద్యాశాఖ అధికారులు స్పందించకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నత స్థాయి అధికారులు వెళ్లి విచారణ నిర్వహించాల్సి ఉండగా, ప్రధానోపాధ్యాయుడితో విచారణ జరిపి సరిపెట్టడం ఎంత వరకు సమంజసమని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయంలో జిల్లా ఉన్నతాధికారులు స్పందించి జరిగిన ఘటనపై క్షేత్ర స్థాయిలో దర్యాప్తు జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి


వినోదమ్మ (ఫైల్)

మర్పల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఒంటరిగా ఉంటున్న ఓ వృద్ధురాలు ఇంటి ఆవరణలోని మంచినీటి బావిలో పడి అనుమానాస్పదంగా మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని కోటమర్పల్లిలో సోమవారం జరిగింది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కోటమర్పల్లికి చెందిన వినోదమ్మ(63) భర్త కమల్‌రెడ్డి, వారికి ఇద్దరు కూతుళ్లు విమలమ్మ, జ్యోతికి వివాహం జరిగింది. మూడేళ్ల కిందట భర్త కమల్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందడంతో వినోదమ్మ ఒంటరిగా ఉంటోంది. ఆదివారం రాత్రి ఇంట్లో తలుపులు వేసి నిద్రిస్తుండగా సోమవారం ఉదయం ఎంతకూ బయటకు రాలేదు. దీంతో చుట్టుపక్కల వారు వెళ్లిచూడగా ఇంట్లో నుంచి పొగలు రావడం గమనించారు. ఇంట్లోకి వెళ్లిచూడగా ఇంట్లోని బీరువా కాలుతూ ఉండటం గుర్తించారు. గ్రామస్తులు వినోదమ్మ కోసం చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభించలేదు. ఇంటి ఆవరణలో ఉన్న మంచి నీటి బావి దగ్గర చెప్పులు, మెడలో ఉన్న బంగారు గుండ్లలో నుంచి ఒక గుండు పడి ఉండటంతో బావిలో చూడగా మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీశారు.

బంగారం కోసమే హత్య?

వినోదమ్మ ఇంట్లో ఒంటరిగా ఉండటంతో ఆమె దగ్గర డబ్బులు, బంగారం ఉంటుందని దుండగులు ఇంట్లోకి చొరబడి ఆమెను హత్య చేసి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటనాస్థలాన్ని వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, మోమిన్‌పేట్ సీఐ నవీన్‌కుమార్ పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. జాగిలాలతో తనిఖీ చేపట్టగా మూడు కిలో మీటర్ల మేర కొందరి పొలాల చుట్టూ తిరిగి వెనక్కి వచ్చాయి. కాగా మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వృద్ధురాలి మృతదేహాన్ని మర్పల్లి ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

కీసర రూరల్/పరిగి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. ఇన్నోవా కారు లారీ ఢీకొన్న ఘటనలో మేడ్చల్ జిల్లా నాగారం మున్సిపాలిటీ కొకకోలా కాలనీకి చెందిన ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం తెల్లవారుజామున జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగారం మున్సిపాలిటీకి చెందిన రాహుల్(23) గీతాంజలి కళాశాలలో ఎంబీఏ చదువుతున్నాడు. రాహుల్ అన్నయ్య వివాహ వేడుక నిమిత్తం ఆదివారం అనంతపురానికి చేరుకున్నాడు. పెళ్లి వేడుకలు ముగించుకుని మరో నలుగురు బంధువులతో కలిసి నాగారం మున్సిపాలిటీకి కారులో తిరుగుప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో కర్నూల్ పట్టణ సమీపానికి చేరుకోగా డ్రైవింగ్ చేస్తున్న రాహుల్ నిద్ర మత్తులో ఎదురుగా వెళ్తున్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రాహుల్‌కు తీవ్రగాయాలు కాగా బంధువులు వెంటనే సమీపంలో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కారులో ప్రయాణిస్తున్న మిగతా నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. రాహుల్ మృతితో నాగారం మున్సిపాలిటీ కొకకోల కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. రాహుల్ మిత్రులు అతడి మృతి పట్ల సంతాపం తెలిపారు. మరో ప్రమాదం పరిగి పరిధిలో చోటుచేసుకుంది. రెండు బైక్‌లు, కంటెయినర్ ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం రాత్రి జరిగింది. పరిగి మండలం రంగంపల్లికి చెందిన ముష్టి శ్రీశైలం(21) ఒక బైక్‌పై, సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన మల్లేశం, అమృతమ్మలు మరోబైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా సుల్తాన్‌పూర్ గేట్ శివారులో బ్రిడ్జి ఎదురుగా వస్తున్న కంటేయిన్ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీశైలం అక్కడికక్కడే మృతిచెందాడు. మల్లేశం, అమృతమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరికి పరిగి ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్సలు నిర్వహించి మెరుగైన వైద్యం కోసం నగరానికి తరలించారు. పరిగి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రెండిళ్లలో చోరీ

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రెండిళ్లలో చోరీ జరిగిన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఎన్ఎఫ్‌సీనగర్‌లో నివాసముంటున్న మంచాల విష్ణు, భార్య నవ్య, పిల్లలతో కలిసి యాదాద్రి-భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం పడమటి సోమారంలో జరిగిన శ్రీ లింగబస్వయ్యస్వామి ఆలయం జాతరకు ఆదివారం రాత్రి వెళ్లి ఉదయం వచ్చేసరికి ఇంటి డోర్‌తీసి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని వస్తువులన్నీ చిందరవందరగా పడిఉన్నాయి. బీరువాలోని అరతులం బంగారు చెవికమ్మలు, రెండు గ్రాముల చెవిదుద్దులు, రూ.5వేల నగదు ఎత్తుకెళ్లారు. అదేవిధంగా గుత్తుల కమల తన భర్తకు అనారోగ్యం కావడంతో ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. ఇదే అదనుగా గుర్తుతెలియని దుండగులు ఇంటి డోర్ పగులగొట్టి లోపలికి చొరబడ్డారు. బీరువాలోని అరతులం బంగారు చెవికమ్మలు, అరతులం బంగారు రింగు, వెండి పూజా సామగ్రితో పాటు రూ.5వేల నగదును ఎత్తుకెళ్లారు. మంచాల విష్ణు కమలకు ఇంట్లో జరిగిన దొంగతనం విషయం తెలియడంతో హుటాహుటిన ఇంటికి చేరుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మర్పల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కారు, బైక్ ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలై ఆసుపత్రి పాలయ్యారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని పట్లూర్ గ్రామానికి చెందిన మోష తన బంధువు సలీంపూర్‌కు చెందిన ప్రభు ఇద్దరు కలిసి బైక్‌పై మొగిలిగుండ్ల గ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని బూచన్‌పల్లికి చెందిన రమేశ్ కారులో బుదేల్ నుంచి మర్పల్లి వస్తుండగా కారుతో పట్లూర్ గ్రామంలో బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

మైసమ్మగూడలో అగ్నిప్రమాదం

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ శివార్లలో స్క్రాప్ నిలువ చేసిన ప్రాంతంలో అగ్నిప్రమాదం సంభవించింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మైసమ్మగూడ గ్రామ శివార్లలో స్క్రాప్ డంప్ చేసిన ప్రాంతంలో సోమవారం మధ్యాహ్నం మంటలు చెలరేగటంతో స్థానికులు పోలీసులకు, అగ్నిమాక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక దళం ఘటనాస్థలానికి చేరుకునే లోపు మంటలు మరింత ఉధృతమై అక్కడ నిలువ చేసిన స్క్రాప్ దగ్ధమైంది. కాగా, రెండు నెలల క్రితం స్క్రాప్ నిలువ చేసుకోవటానికి ఓ వ్యాపారి స్థలం అద్దెకు తీసుకుని వ్యర్థాలను డంపింగ్ చేస్తున్నట్లు తెలిపారు. ఘటనాస్థలంలో సంబంధిత స్క్రాప్ యజమానులు లేకపోవడం గమనార్హం. ఈ ప్రమాదంలో నష్టం ఎంత వరకు వాటిల్లిందో తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. జీడిమెట్ల అగ్నిమాపకదళం వారు మంటలను చల్లార్చారు. పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డివాములు దగ్ధం

మర్పల్లి: గుర్తు తెలియని వ్యక్తులు గడ్డివాములకు నిప్పంటించడంతో రూ.2లక్షల విలువ గల పశుగ్రాసం దగ్ధమైంది. బాధిత రైతులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కొత్లాపూర్‌కు చెందిన జైపాల్‌రెడ్డి, రాములకు చెందిన మూడు గడ్డివాములు నిల్వచేశారు. మధ్యాహ్నం సమయంలో గడ్డివాముల నుంచి పొగ రావడంతో గమనించిన స్థానికులు రైతులకు సమాచారం అందించారు. మంటలను ఆర్పేందుకు ప్రయత్నించి అప్పటికే మంటలు చెలరేగడంతో గడ్డివాములు పూర్తిగా దగ్ధమయ్యాయి. దీంతో తీరని నష్టం వాటిల్లిందని బాధిత రైతులు వాపోయారు.